సాక్షి తిరుపతి

శనివారం । 27 । జనవరి । 2024



వ్యవసాయంలో రికార్డ్

విద్యుత్ వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో రికార్డు సృష్టించినట్టు సీఎండీ సంతోషరావు తెలిపారు. - 8లో



భవితకు పెట్టుబడి అమ్మఒడి

అమ్మఒడి పథకం విద్యార్థుల భవితకు పెట్టుబడిగా నిలుస్తోందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. - 8లో



మద్యం విక్రేత అరెస్ట్

కేవీబీపురం మండలం, అంగేరి చెరువు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 54,105 మంది స్వామివారిని దర్శించుకోగా, 23,590 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈఓకు నగదు అందిస్తున్న భవానీశంకర్‌సింగ్

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం తిరుపతి జిల్లా గూడూరుకు చెందిన భవానీశంకర్‌సింగ్, జ్యోతిభాయ్ రూ.1,01,116ను విరాళంగా అందించారు. ఈ మేరకు నగదును ఆలయ ఈఓ జనార్దన్‌రెడ్డికి అందజేశారు. అనంతరం దాతలకు స్వామి, అమ్మవార్ల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

జూనియర్ సివిల్ జడ్జిగా ప్రశాంత్



తిరుపతి లీగల్: తిరుపతిలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న పల్లెపాగు ప్రశాంత్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. శుక్రవారం జూనియర్ సివిల్ జడ్జిలుగా ఎంపికైన వారి వివరాలను రాష్ట్ర హైకోర్టు విడుదల చేసింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, సీనియర్ ఏపీపీగా విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన పల్లెపాగు శ్రీనాథ్ కుమారుడు ప్రశాంత్. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ లా కోర్సు చదివారు. 2017లో న్యాయవాదిగా తిరుపతిలో ప్రాక్టీస్ ప్రారంభించారు. తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ హైకోర్టుల్లో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. జూనియర్ సివిల్ జడ్జిగా ప్రశాంత్ మెరిట్‌లో ఎంపిక కావడంపై తిరుపతి న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పేద ప్రజలు, వెనుకబడిన వర్గాల ప్రజలకు సత్వర న్యాయం అందిస్తామన్నారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు



సర్దిచెబుతున్న తహసీల్దార్ ఉదయ్‌సంతోష్

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ సర్వే నం.153లోని 40 ఎకరాల ప్రభుత్వ స్థలంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో స్థానికులు గుడిసెలు వేసుకుని ఆక్రమించేందుకు ప్రయత్నించారు. వివరాలు.. తిరుపతి-కరకంబాడి మార్గం, పంచాయతీ కార్యాలయ సమీపంలో సర్వే నం.153లోని 40ఎకరాల విలువైన ప్రభుత్వ స్థలంలో సీపీఎం ఆధ్వర్యంలో కరకంబాడికి చెందిన కొందరు, స్థానికేతరులు మరికొందరితో సుమారు 200మంది గుడిసెలు వేసేందుకు ప్రయత్నించారు. విషయం తెలుసుకున్న రేణిగుంట తహసీల్దార్ ఉదయ్‌సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని వారిని అడ్డుకున్నారు. సీఐ సుబ్బారెడ్డి పోలీసు సిబ్బందితో అక్కడకు చేరుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించిన వారిని చెదరగొట్టారు. ఇల్లు లేని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే 90 రోజుల్లోపు ఇంటిస్థలం అందిస్తామని స్పష్టం చేశారు. దౌర్జన్యంగా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధే అ'జెండా'



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి,ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి



పోలీస్ పరేడ్ గౌరవ వందనం



ప్రగతి శకటం

'రాష్ట్రంలో నవశకం నడుస్తోంది. అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతోంది. జిల్లాల పునర్విభజన తర్వాత తిరుపతి జిల్లా కొత్త పుంతలు తొక్కుతోంది. పర్యాటక, వాణిజ్య, వ్యవసాయ, మత్స్యశాఖలపరంగా మరింత అభివృద్ధి దిశగా దూసుకుపోతోంది' అని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. తిరుపతి వేదికగా జరిగిన గణతంత్ర దినోత్సవంలో ఆయన పాల్గొని జిల్లా అభివృద్ధిని విశదీకరించారు.

- ఘనంగా గణతంత్ర దినోత్సవం
- తిరుపతి పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా జిల్లా కార్యక్రమం
- 330 మందికి ప్రతిభాపురస్కారాలు
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- స్వాతంత్య్ర సమరయోధుడి కుమారుడికి సన్మానం

తిరుపతి అర్బన్: 'అభివృద్ధే ఎజెండా'గా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా తిరుపతి జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతున్నట్లు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ వేదికగా 75వ గణతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతోపాటు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్, తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత, జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్, తిరుపతి ఆర్డీఓ నిషాంత్‌కుమార్‌రెడ్డి విచ్చేశారు. జాతీయ జెండాను కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. ముందుగా స్వాతంత్య్రసమరయోధుడు రామలింగరాజు కుమారుడు రాధాకృష్ణరాజును ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ విభాగాలకు చెందిన 330 మంది అధికారులు, ఉద్యోగులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. 14 స్టాల్స్, 10 ప్రగతి శకటాలను ప్రదర్శించారు. సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు డాగ్ స్క్వాడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

విద్యాశాఖ శకటానికి మొదటి బహుమతి

10 ప్రగతి శకటాలను ప్రదర్శించగా అందులో తొలి బహుమతి విద్యాశాఖ శకటాన్ని వరించింది. ద్వితీయ బహుమతి గృహనిర్మాణశాఖకు అందించారు. పోలీసు జాగిలాల ప్రదర్శన ఆకట్టుకుంది.

ఆకట్టుకున్న సాంస్కృతిక కళారూపాలు

సేవ్ అవర్ సోల్ పాటకు ఏర్పేడు మండల విద్యార్థులు, వందేమాతరం జయహో పాటకు ఎస్వీడబ్ల్యూ కళాశాల విద్యార్థినులు, మూకాభినయం పాటకు ఎస్జీఎస్‌హై స్కూల్ విద్యార్థులు, ఓంకారమే వేదమై పాటకు బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు సభికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులకు బహుమతులు అందజేశారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉత్తమ అవార్డు

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉత్తమ హాస్పిటల్ అవార్డును డాక్టర్ సీ.వెంకటరమణ హాస్పిటల్ ఎండీ ఆర్.నిరుపమ అందుకున్నారు.

నవశకం ఆరంభం

జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు జిల్లా నుంచి 20 మండలాలు, నెల్లూరు జిల్లా నుంచి 14 మండలాలతో 34 మండలాల తిరుపతి జిల్లా 2022 ఏప్రిల్ 4న కొత్త జిల్లాగా అవతరించిందన్నారు.

- జిల్లాలో 691 గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 16.64 లక్షల మందికి పౌర సేవలు

- 445 వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.13.53 కోట్ల రాయితీలతో ఎరువులు
- వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ ద్వారా ఇప్పటి వరకు 1,80,654 మంది రైతులకు రూ.706.7కోట్లు
- వైఎస్సార్ సున్నావడ్డీ పథకం ద్వారా జిల్లాలో 72,410 మంది రైతులకు రూ.14 కోట్లు
- వైఎస్సార్ ఉచిత పంటబీమా ద్వారా 33,295 మంది రైతులకు రూ.23.04 కోట్లు
- 2020-23కు సంబంధించి ఖరీఫ్‌లో 3,01,520 మంది రైతులకు రూ.4988 కోట్లు, రబీలో 52,132 మంది రైతులకు రూ.23.04 కోట్లు
- వైఎస్సార్ యంత్రసేవా పథకం ద్వారా 472 కస్టమర్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ట్రాక్టర్లు, పరికరాలను 40శాతం రాయితీతో పంపిణీ
- ఉద్యాన పంటల సాగుకు రూ.6.43 కోట్ల రాయితీ
- వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా 2,74,894 మందికి లబ్ధి



ఉత్తమ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఆస్పత్రి అవార్డు అందుకుంటున్న వెంకటరమణ హార్ట్ అండ్ మెటర్నిటీ ఆస్పత్రి యాజమాన్యం

మరింత రుచికరంగా అన్నప్రసాదాలు

తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనార్థం విచ్చేసే భక్తులకు మరింత రుచికరంగా, నాణ్యంగా అన్నప్రసాదాలు అందించేందుకు అన్నప్రసాద విభాగాన్ని పునర్‌వ్యవస్థీకరించి వృత్తి నైపుణ్యం పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్టు టీటీడీ ఈఓ ఏవీ.ధర్మారెడ్డి తెలిపారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా తిరుమలలోని గోకులం విశ్రాంత గృహంలో ఆయన జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ శ్రీవారి ఆశీస్సులతో గతేడాది డిసెంబర్ 6న కురిసిన భారీ వర్షంతో తిరుమలలోని జలాశయాలన్నీ నిండాయన్నారు. గత ఆగస్టు నుంచి ఆరు నెలల వ్యవధిలో మెరుగైన వసతి, అన్నప్రసాదాలతోపాటు, రెండు బ్రహ్మోత్సవాలు, వైకుంఠద్వార దర్శనం, తిరుమల ఎస్వీ హైస్కూల్‌లో విద్యాప్రమాణాల పెంపు తదితర ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఈ-2 జగదీశ్వర్‌రెడ్డి, వీజీఓ నందకిషోర్, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.



తిరుమలలో జెండా ఆవిష్కరిస్తున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

విమానాశ్రయంలో గణతంత్ర దినోత్సవం

రేణిగుంట: తిరుపతి విమానాశ్రయంలో గణతంత్ర దినోత్సవ సంబరాలు అంబరాన్నంటాయి. ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బసవరాజు నేతృత్వంలో నూతన టెర్మినల్ ప్రాంగణం ముందున్న 100 అడుగుల మువ్వన్నెల జెండాను ఎగురవేసి జెండా వందనం స్వీకరించారు. సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది ప్రత్యేక కవాతు నిర్వహించారు. ఎయిర్‌పోర్ట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న డైరెక్టర్



సాంస్కృతిక కార్యక్రమాలు

ఆధునిక అభివృద్ధికి ఆధ్యాత్మిక శోభ

- పుణ్యపురుషుల పేర్లతో తిరుపతికి మరింత పవిత్రత
- టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- కందాడై రామానుజ అయ్యంగార్ రహదారి ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త, డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఆధునిక అభివృద్ధికి ఆధ్యాత్మిక శోభ జోడిస్తున్నామని, పుణ్యపురుషులు, శ్రీవారి సేవకుల పేర్లతో తిరుపతికి మరింత పవిత్రత చేకూరిందని టీటీడీ ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి భవానీ నగర్, టీటీడీ పరిపాలనా భవనానికి దక్షిణం వైపు ఉన్న రోడ్డును విస్తరించి నూతనంగా అభివృద్ధి చేశారు. దీనికి కందాడై రామానుజ అయ్యంగార్ మార్గంగా నామకరణం చేసి శుక్రవారం టీటీడీ ఛైర్మన్‌తోపాటు మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ రెడ్డి, కమిషనర్ హరితతో కలిసి ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు వారిని గజమాలలతో ఘనంగా సత్కరించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. అనంతరం టీటీడీ ఛైర్మన్ మాట్లాడుతూ తిరుపతి నగరంలో ఎప్పుడూ చూడని అభివృద్ధిని గడిచిన నాలుగేళ్లలో చేసి చూపించామన్నారు. తిరుపతి పవిత్రతను దృష్టిలో ఉంచుకుని శ్రీవారి సేవకులు, పుణ్యమూర్తుల పేర్లను పెట్టామన్నారు. రహదారుల అభివృద్ధితో నగరం మరో 5 వేల ఎకరాల్లో విస్తరించనుందని చెప్పారు. భవానీనగర్ వాసులు 40 ఏళ్లుగా ఇరుకు రోడ్లతోనే సహవాసం చేశారని, స్థానికుల విజ్ఞప్తి మేరకు రోడ్డును విస్తరించామన్నారు. ప్రస్తుతం ఈ రహదారి 30 నుంచి 40 అడుగుల వరకు అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ రహదారికి వేంకటేశ్వరస్వామి వారికి సేవ చేసిన కందాడై రామానుజ అయ్యంగార్ పేరును నామకరణం చేశామన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ తాము మాటలు చెప్పే నాయకులం కాదని, ప్రజలకు సేవ చేసుకునే సేవకులమని స్పష్టం చేశారు. రోడ్ల విస్తరణ, ఆధునికీకరణ, నూతన రహదారుల నిర్మాణంతో ట్రాఫిక్ ఒత్తిడి అధిగమించగలిగామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రంతోపాటు తిరుపతి మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆర్‌సీ. మునికృష్ణ, దూదికుమారి, శేఖర్‌రెడ్డి, వరికుంట్ల నారాయణ, తాళ్లూరి రత్నకుమారి, తిరుపతి మునిరామిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, మునిసిపల్ అధికారులు ఎస్.ఈ మోహన్, ఎంఈలు వెంకటరామిరెడ్డి, చంద్రశేఖర్, డీఈ విజయకుమార్‌రెడ్డి, నాయకులు, స్థానికులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, దినేష్ రాయల్, అనిల్ రాయల్, అశోక్ రెడ్డి, చందూ రాయల్, వెంకటేష్ రాయల్, తలారి రాజేంద్ర, ఇంప్రెస్ ప్రొపరైటర్ కిషన్, లవ్లీ వెంకటేశ్వర్లు, గీత, పునీత పాల్గొన్నారు.

సమన్వయం..నూతనోత్సాహం!

- జగనన్నను మళ్లీ గెలిపిద్దాం
- ఐకమత్యంతో ముందుకు సాగుదాం
- సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ గురుమూర్తి పిలుపు

పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గం, పిచ్చాటూరు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశం కార్యకర్తలో జోష్ నింపింది. గ్రూపు రాజకీయాలు పక్కనబెట్టి కార్యకర్తలు, నేతలందరూ సమావేశానికి హాజరు కావడంతో కేడర్ ఆనందడోలికల్లో మునిగితేలింది. సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ గురుమూర్తి శుక్రవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో తొలి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి చాలారోజుల తర్వాత అందరూ ఒకే వేదికపై కనిపించడంతో పార్టీ నేతల్లో నూతనోత్సాహం కనిపించింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే ధ్యేయంగా పనిచేయాలన్నారు. పార్టీ కేడర్ ఐకమత్యంతో ఉండి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల విజేతలు కిషోర్, మధును ఎంపీ అభినందించారు.

తిరుపతి సమావేశానికి ఆహ్వానం

శనివారం తిరుపతి పీఎల్ఆర్ కల్యాణ మండపంలో సత్యవేడు నియోజకవర్గ కార్యకర్తల సమావేశం రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని ఆయన సూచించారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు కేవీ.చలపతి రాజు, సింగిల్ విండో ఛైర్మన్ కేటీ.హరిశ్చంద్రారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ.భాస్కర్‌నాయుడు, సర్పంచ్ కేజీ.రోస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు విష్ణుప్రియ, జేసీఎస్ కన్వీనర్ తొప్పయ్య, మాజీ వైస్ ఎంపీపీ పాల పద్మనాభం, ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు మునిరాజ, సింగిల్ విండో ఛైర్మన్ శేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ గురుమూర్తి

16వేల మంది ఉద్యోగులకు
నూతన దుస్తులతో సత్కారం

- రిపబ్లిక్ డే సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఉద్యోగులందరికీ ఆత్మీయ సన్మానం
- ప్రతి ఏటా కొనసాగింపు
- చంద్రగిరి అభివృద్ధిలో అలసిపోని వీరులు మీరు
- తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి



చంద్రగిరి నియోజకవర్గంలో పనిచేస్తున్న ఉద్యోగులకు నూతన వస్త్రాలను అందిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

తిరుపతి రూరల్: ''ప్రభుత్వ ఉద్యోగులారా మీకు వందనం.. అభివందనం.. భారత దేశ ప్రగతికి మీరు రాజ్యాంగబద్ధంగా అందించిన సేవలు అమూల్యం. గణతంత్రాన్ని 'ఘన' తంత్రంగా తీర్చిదిద్దే కృషిలో మీ పాత్ర అమోఘం. అనిర్వచనీయం. ప్రతి పనిలో రాజ్యాంగ స్ఫూర్తిని చాటుతున్న దార్శనికులు మీరు.. చంద్రగిరి నియోజకవర్గ పురోగతిలో అలసిపోని అజ్ఞాత వీరులుగా గుర్తిస్తున్నాం.. అందుకే మీ పట్ల మాకున్న అమితమైన గౌరవాన్ని, మర్యాదను చాటుకుంటూ యావత్తు భారతావని అధికారికంగా పరిపాలన ప్రారంభించుకున్న అతి పవిత్రమైన గణతంత్ర్య దినోత్సవం రోజున నూతన వస్త్రాలతో చిరు సత్కారం చేయడం అదృష్టంగా భావిస్తున్నాం'' అంటూ తుడా ఛైర్మన్ మోహిత్ రెడ్డి వెల్లడించారు. చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఉద్యోగులందరికీ ప్రతి ఏటా నిర్వహించే ఆత్మీయ సన్మానంలో భాగంగానే శుక్రవారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా నూతన వస్త్రాలు పెట్టి గౌరవించారు. ఇకపై కూ ఈ విధానాన్ని కొనసాగిస్తామని చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు.

చంద్రగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విధులు నిర్వహించే పంచాయతీ స్వీపర్లు, వలంటీర్లు, టీచర్లు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, పోలీసులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సంఘమిత్రలు, ఏఎన్ఎంలు, విద్యుత్తు సిబ్బంది, వ్యవసాయ, పశుసంవర్ధక, రెవెన్యూ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, గృహ నిర్మాణం, దేవాదాయ ధర్మాదాయ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు మండలస్థాయి అధికారులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, కాంట్రాక్టు ఉద్యోగులు కలిపి 16 వేల మందికిపైగా ఉద్యోగులకు శుక్రవారం నాణ్యమైన కొత్త దుస్తులు అందజేసి గౌరవంగా సత్కరించారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి మోహిత్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనులతో పంచాయతీల రూపు రేఖలు మార్చడంలో అన్ని శాఖల అధికారుల పాత్ర అద్వితీయమని కొనియాడారు. కరోనా సమయంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన సేవా కార్యక్రమాలకు వెన్నంటి నడవడం ఆజన్మాంతం గుర్తు పెట్టుకుంటామన్నారు. ప్రజలను రక్షించే క్రమంలో వరదలు వచ్చినా.. ఆరోగ్య సమస్యలు వచ్చినా.. తమతో పాటు అధికారులు అందరూ రాత్రి పగలు పనిచేసి చంద్రగిరి నియోజకవర్గాన్ని దేశానికి ఆదర్శంగా చూపడంలో పడ్డ శ్రమ మరువలేమన్నారు. గడచిన ఐదేళ్లలో చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సంక్షేమం, ప్రగతి పనులను పూర్తిచేయడంలో కృషిచేస్తున్న ప్రతి ఉద్యోగికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా మీ అందరి ఆశీర్వాదంతో మన నియోజకవర్గ మరింత అభివృద్ధికి కలసి పనిచేద్దామని విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

టీడీపీ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసు

పాకాల: మండలంలోని మొగరాల పంచాయతీ, జంగాలపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు హరికృష్ణ నాయుడుని బెదిరించి, దౌర్జన్యానికి పాల్పడి, కిడ్నాప్ చేసిన ఘటనలో టీడీపీ నాయకులపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వైఎస్సార్‌సీపీలో చేరిన హరికృష్ణ నాయుడిని బెదిరింపులకు గురిచేసి, అతనిపై దౌర్జన్యానికి పాల్పడి, కిడ్నాప్ చేసినట్లు ఫిర్యాదు అందిందన్నారు. ఈ ఘటనకు పాల్పడిన టీడీపీ నాయకులు మాన్యం కిషోర్, రేచర్ల ఆనందచౌదరి, బొల్లినేని సురేష్, డేవిడ్ సురేష్, చిన్నరెడ్డెప్పపై కేసు నమోచేసినట్లు వివరించారు. ప్రస్తుతం ముద్దాయిలు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. బాధితునికి తగిన రక్షణ కల్పించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

వైఎస్సార్‌సీపీలో చేరాననే!

ప్రభుత్వం చేసిన అభివృద్ధి నచ్చి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఆకర్షితుడినై టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరానని హరికృష్ణ తెలిపారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక టీడీపీ నాయకులు తనపై కక్ష గట్టి బెదిరించి, దౌర్జన్యాలకు తెగబడి కిడ్నాప్ చేశారని తెలిపారు. ఆపై తనకు ఇష్టం లేకపోయిన బలవంతంగా టీడీపీ కండువా కప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆటో బోల్తా-ముగ్గురికి గాయాలు

నాయుడుపేట: మండలంలోని అన్నమేడు రైస్‌మిల్ వద్ద శుక్రవారం ఆటో బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. వేముగుంపాళెం గ్రామం నుంచి నాయుడుపేటకు కూలి పనులు నిమిత్తం ఆటోలో వస్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన బల్లి పెంచలమ్మ(50) మృత్యువాత పడింది. మరో ముగ్గురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



అమ్మఒడి.. భవితకు పెట్టుబడి

చదువుకు పేదరికం అడ్డురాకూడదు. ప్రతితల్లీ తమ బిడ్డలను చదివించాలనే సంకల్పంతో అమ్మఒడి పథకాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారు. పుట్టిన బిడ్డకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ నుంచి విద్యార్థి దశ వరకు వివిధ రూపాల్లో లబ్ధి చేకూర్చుతున్నారు. పేదింటి పిల్లలను వెన్ను తట్టి నేనున్నానంటూ భరోసా ఇస్తున్నారు.

- లబ్ధిదారుల కుటుంబాల్లో వెల్లివిరిసిన సంతోషం
- వరుసగా 4 విడతలు అమ్మఒడి నిధులు జమ
- సత్యవేడు నియోజకవర్గంలో 27,794 మందికి లబ్ధి


వరదయ్యపాళెం సచివాలయం వద్ద జాబితాను పరిశీలించుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

వరదయ్యపాళెం: భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ అమల్లో లేని అమ్మఒడి పథకంపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల్లో 27,794 కుటుంబాలకు అమ్మఒడి నిధులు మంజూరయ్యాయి. అమ్మఒడి నగదును నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గడిచిన నాలుగు విడతల్లో రూ.120 కోట్ల మేర తల్లుల ఖాతాల్లోకి జమ అయింది.

ఆర్థిక భరోసా

గతంలో పేద కుటుంబాల పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు. ఇలాంటి సమయంలో అమ్మఒడి ఆయా కుటుంబాలకు కొండంత భరోసానిచ్చింది. ఈ పథకం ద్వారా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లుల ఖాతాలకు ఏడాదికి రూ.13 వేల చొప్పున జమ చేస్తున్నారు.

సత్యవేడు నియోజకవర్గంలో జగనన్న అమ్మఒడి వివరాలు

మండలం	లబ్ధిదారుల సంఖ్య
కేవీబీపురం	4,945
వరదయ్యపాళెం	5,488
నారాయణవనం	3,888
నాగలాపురం	3,342
పిచ్చాటూరు	2,323
సత్యవేడు	4,542
బుచ్చినాయుడుకండ్రిగ	3,266

అద్భుతమైన పథకం



అమ్మఒడి వంటి పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని కలలో కూడా ఊహించలేదు. మాకు ఒక పాప ఉంది. నాకు కూడా ఈ పథకం వర్తించింది. గడిచిన నాలుగు విడతలుగా నగదు అందుకున్నాను. గతంలో ఏ ముఖ్యమంత్రికి రాని సరికొత్త ఆలోచన ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి వచ్చినందుకు సంతోషంగా ఉంది.
–సుమతి, వరదయ్యపాళెం మండలం

తల్లులకు ఆసరా



పేదరికంలో మగ్గుతున్న పిల్లల తల్లులకు అమ్మఒడి ఆసరాగా నిలుస్తోంది. కూలి పనులు చేసుకుని బిడ్డలను చదివించుకోలేక మధ్యలోనే చదువు మాన్పించేవాళ్లం. అలాంటి వారి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం అండగా నిలుస్తోంది. గడిచిన నాలుగేళ్లు పథకం వర్తించింది. చిరకాలం ఆయనే సీఎంగా ఉండాలి.
–కే.సుహాసిని, ఎంజీనగర్

రుణపడి ఉంటాం



పేద విద్యార్థుల చదువులు మధ్యలోనే ఆగిపోకుండా ఉండేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న అమ్మఒడి పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా మొదటి విడతలో రూ.15వేలు, రెండో విడతలో రూ.14వేలు, 3, 4 విడతల్లో రూ.13వేలు చొప్పున అందుకున్నా. నా ఇద్దరు పిల్లలను ఈ పథకం ద్వారా ఉన్నత చదువులు చదివించుకుంటున్నా. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం. –వనమ్మ, తొండంబట్టు

చదువు భారం కాకూడదనే



నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 6, మరొకడు 10వ తరగతి చదువుతున్నారు. వీరిని చదివించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. ప్రస్తుతం సీఎం జగనన్న ప్రవేశపెట్టిన అమ్మఒడి పథకం మాకు ఎంతో ఊరటనిచ్చింది. మా లాంటి పేదలకు పిల్లల చదువు భారం కాకూడదనే సీఎం జగనన్న ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లుంది. –మీన, పెద్దవీధి, పిచ్చాటూరు

పేద బిడ్డలకు మంచి రోజులు

రాష్ట్రానికి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక మాకు, మా పిల్లల భవిష్యత్‌పై నమ్మకం పెరిగింది. బడికి పంపితే ఏటా రూ.13 వేలు ఇవ్వడం పేదోళ్లకు ఒక వరమే. పేదోల పిల్లలకు కూడా కార్పొరేట్ విద్యార్థులులాగా హుందాగా పోతున్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో నా కష్టమంతా తీరింది. నా కొడుకు చదువు భారాన్ని సీఎం జగనన్నే చుసుకోవడం ఆనందంగా ఉంది
–అమరావతి, తిరువట్యం, నారాయణవనం మండలం

వీఆర్వోపై దాడి.. కేసు నమోదు

చంద్రగిరి: ప్రభుత్వ కులగణన సర్వే నిర్వహిస్తున్న వీఆర్వోపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు చంద్రగిరి సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులకు ఆ వివరాలు వెల్లడించారు. మండలంలోని రాయలపురం పంచాయతీకి చెందిన వీఆర్వో హరికృష్ణ 19 నుంచి కులగణన సర్వే చేస్తున్నారు. గురువారం రాత్రి రాయలపురంలో వలంటీర్లతో కలిసి సర్వే చేస్తుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ మనోహర్, సుబ్రమణ్యం కులగణన సర్వే చేయరాదని వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆగ్రహం చెందిన మాజీ సర్పంచ్ మనోహర్, సుబ్రమణ్యం వీఆర్వోపై దాడి చేశారు. గ్రామస్తులు అక్కడికి చేరుకుని వీఆర్వోను రక్షించారు. అనంతరం బాధితుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు దాడికి పాల్పడిన వారిపై గురువారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మాజీ సర్పంచ్ మనోహర్‌తో పాటు సుబ్రమణ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు.

వ్యవసాయంలో ఆల్‌టైం రికార్డు

- ఎస్పీడీసీఎల్ పరిధిలో 78,515 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు
- అత్యుత్తమ సేవలతో సంస్థకు ఏ గ్రేడ్ రేటింగ్
- గణతంత్ర దినోత్సవంలో సీఎండీ సంతోషరావు


ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో జెండా ఆవిష్కరిస్తున్న సీఎండీ సంతోషరావు



నూతన అప్లికేషన్స్‌ను ఆవిష్కరిస్తున్న సీఎండీ సంతోషరావు

తిరుపతి రూరల్: విద్యుత్ వ్యవసాయ కనెక్షన్ల మంజూరులో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) ఆల్‌టైం రికార్డు సృష్టించిందని సీఎండీ సంతోషరావు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీడీసీఎల్ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతూ ఉద్యోగులు సమష్టి కృషితో అందించిన అత్యుత్తమ సేవలకు గుర్తింపుగా ఇటీవల జాతీయ స్థాయిలో 'ఏ' గ్రేడ్ రేటింగ్ అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీకి సంబంధించి గత ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5,342 కోట్లు, 2023 డిసెంబర్ వరకు రూ.4,503 కోట్లను విడుదల చేసినట్టు వెల్లడించారు. సంస్థ పరిధిలోని 11.9 లక్షల మంది రైతులకు పగటిపూట 9 గంటలు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్టు తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 78,515 వ్యవసాయ విద్యుత్ సర్వీసులు మంజూరు చేసినట్టు వెల్లడించారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీ నంబర్లు- 1912, 1800 425 155333కు కాల్ చేయడం, 91333 31912 ద్వారా వాట్సాప్ చాట్, చాట్బోట్ సేవలద్వారా పరిష్కరించుకోవచ్చని చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆనందింపజేశాయి. ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

నూతన అప్లికేషన్ల ఆవిష్కరణ

గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఎస్పీడీసీఎల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం రూపొందించిన సర్టిఫికెట్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ చార్జ్ (సీటీసీ), ఎల్‌టీ మీటర్ మేనేజ్మెంట్ యాప్, వెండార్ యాప్‌లను సీఎండీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్స్ డైరెక్టర్ శివప్రసాదరెడ్డి, డైరెక్టర్లు వీఎస్.బాబు, సుబ్బరాజు, చీఫ్ జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

కేవీబీపురం: మండలంలోని అంగేరి చెరువు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కాసరం బుజ్జిబాబు(49)ను అదుపులోకి తీసుకుని రూ.2 వేల విలువ చేసే మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

తొట్టంబేడులో

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలం, తంగేళ్లపాళెం వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న అదే గ్రామానికి చెందిన చలపతిని అదుపులోకి తీసుకుని 14 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రాచగున్నేరి వద్ద...

శ్రీకాళహస్తి మండలం, రాచగున్నేరి వద్ద మద్యం అక్రమంగా విక్రయిస్తున్న భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు రూరల్ సీఐ అజయ్ కుమార్ తెలిపారు. నిందితుని వద్ద నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన వెల్లడించారు.

ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు


మాట్లాడుతున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి తుడా: ప్రజలందరికీ అభివృద్ధి ఫలాలు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. గ్రామస్వరాజ్యం సాధించినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వస్తుందన్న గాంధీజీ మాటలను నేడు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిజం చేశారన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం తుడా ఆవరణలో ఆయన జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. అనంతరం మహాత్మాగాంధీ చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. జాతీయ గీతాన్ని ఆలపించి దేశ భక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్ మాట్లాడుతూ తుడా నేతృత్వంలో గ్రామీణ, పట్టణ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. తుడా బ్రాండ్ విలువలను కాపాడుకునే దిశగా ఉద్యోగులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తుడా అధ్యక్షులుగా అభివృద్ధిలో సంస్థకు రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చారని గుర్తుచేశారు. అనంతరం తుడా వీసీ హరికృష్ణ మాట్లాడుతూ కోర్టు కేసులు చాలా వరకు అధిగమించామన్నారు. మరింత పురోగతి దిశగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. తుడా సెక్రటరీ వెంకటనారాయణ, ఎస్‌ఈ వరదారెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, ప్రణాళిక విభాగం జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ వాసుదేవనాయుడు పాల్గొన్నారు.



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న తిరుపతి నగరపాలక కమిషనర్ హరిత

సేవకు సత్కారం

గణతంత్ర దినోత్సవాన్ని తిరుపతి జిల్లా కేంద్రంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన పలువురు అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం వారిని ఆత్మీయంగా సత్కరించారు. వారి సేవలను కొనియాడారు. – తిరుపతి అర్బన్


పెంచలకిశోర్, డీఆర్వో


కోదండరామిరెడ్డి స్పెషల్ డెప్యూటీ కలెక్టర్



శ్రీనివాసులు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్


భాస్కర్‌నాయుడు స్పెషల్ డెప్యూటీ కలెక్టర్


జయరాజ్ సర్వే విభాగం


సుభాష్-జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్


వి.శేఖర్- జిల్లా విద్యాశాఖాధికారి


శ్రీనివాస ప్రసాద్, డ్వామా అధికారి


చెన్నయ్య-ఎస్సీ వెల్ఫేర్ జిల్లా అధికారి


శంకర్‌నారాయణ పంచాతీ రాజ్ జిల్లా అధికారి


విజయకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్


సుధాకర్‌రెడ్డి ఆర్‌అండ్‌బీ


వెంకటేశ్వర్లు గృహనిర్మాణశాఖ


చెంగల్‌రెడ్డి ప్రజారవాణా అధికారి


సుశీలాదేవి-సచివాలయాల జిల్లా ఇన్‌చార్జి


భాస్కర్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి


ఆదినారాయణ మోటార్ వాహనాల అధికారి


డాక్టర్ శ్రీహరి డీఎంహెచ్‌వో


జయపాల్ ఆడిట్ అధికారి


రాజా రఘువీర్ సివిల్ సప్లయ్


రాజశేఖర్‌రెడ్డి పంచాయతీ అధికారి


ప్రతాప్‌రెడ్డి పరిశ్రమల శాఖాధికారి


వెంకటరవి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ


మల్లీశ్వర్‌రెడ్డి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ


జానకీరామ్- జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి


కృష్ణారెడ్డి-విద్యుత్ శాఖ ఈఈ


రుపేంద్రనాథ్‌రెడ్డి- జిల్లా టూరిజం శాఖ


భారతి, కలెక్టరేట్ ఏవో


జ్యోతి, డీఆర్‌డీఏ జిల్లా అధికారి